దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం



నవుదూరు జంక్షన్‌లోని నేషనల్ ఫ్లాగ్ టవర్



టవర్ వద్ద ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమర యోధులు, జాతీయ నాయకుల విగ్రహాలు



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి జ్ఞాపికను ఇస్తున్న వడ్డి సుబ్బారావు (ఫైల్)

నవుదూరులో ఆకట్టుకుంటున్న ఫ్లాగ్ టవర్

వీరవాసరం: సమాజంలో దేశభక్తి చాటడానికి జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు, కట్టడాలు, దేవాలయాల నిర్మాణాలకు చాలా మంది ప్రాధాన్యత ఇస్తుంటారు. వాటికి విరుద్ధంగా భరతమాత సేవలో పునీతమవ్వాలనుకుని సాధారణ తాపీమేస్త్రి మదిలో వచ్చిన ఆలోచన మేరకు నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మించారు. సుమారు 30 అడుగుల ఎత్తులో నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మించి అందులో భరతమాత విగ్ర హాన్ని పెట్టి దేశభక్తి చాటుకుంటున్నాడు. వీరవాసరం మండలం నవుదూరు సెంటర్ కు చెందిన వడ్డీ సుబ్బారావు మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. ఇతను 5వ తరగతి వరకూ చదివి ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మాని తాపీమేస్త్రిగా స్థిరపడ్డాడు. చిన్ననాడు బడిలో నిర్వహించిన భరత మాత పూజ, జెండా వందనం, స్వాతంత్య్ర దినోత్సవం వంటి కార్యక్రమాలు మనసులోనే ఉండిపోయాయి. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ప్రజల సహకారంతో నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మాణం చేశాడు. అప్పటి జిల్లా కలెక్టర్ వసుధామి సహాయంతో 1999 జూన్ 17న అప్పటి నరసాపురం ఆర్డీఓ కె.కన్నబాబు టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే ఏడాది నిర్మాణం పూర్తి చేసి భరతమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ ఫ్లాగ్ టవర్

వీరవాసరం – పెనుమంత్ర రహదారిలో వివిధ దేవాలయాలు అధికంగా ఉండడంతో సందర్శకులు అధికంగా వస్తుంటారు. అదేదారిలో నేషనల్ ఫ్లాగ్ టవర్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. టవర్‌ని భరతమాత విగ్రహాన్ని చూసి నమ స్కారం చేయకుండా వెళ్లని వారు ఉండరు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి నాయకులు ఈ నిర్మాణాన్ని ప్రశంసించారు. మిషనరీ ఆర్ట్స్‌లో నిష్ణాతుడైన వడ్డి సుబ్బారావు టవర్ నమూనా చిత్రాలను దివంగత నేత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సింగి, రాష్ట్ర మాజీ గవర్నర్ సుర్జీత్ సింగ్ బర్నాలా, కేంద్ర మాజీ మంత్రులు కె.చిరంజీవి, యూవీ కృష్ణంరాజులకు నమూనా చిత్రాలను అందజేసి వారితో ప్రశంసలు అభినందనలు అందుకున్నారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, వివేకానంద విగ్రహాలు కూడా ఏర్పాటు చేశారు. వీటితోపాటు దేశానికి అన్నం పెట్టే రైతన్న, దేశాన్ని కాపాడే సైనికుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జరిగే మహాత్మా గాంధీ జయంతికి గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఏడాది స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలు నిర్వహిస్తూ ప్రముఖులకు సన్మా నాలు, విద్యార్థులకు బహుమతులు మెమెంటోలను ఇస్తూ తన దేశభక్తిని చాటుకుంటున్నారు.

దేశ భక్తి పెంపొందించాలనే..



సమాజంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మాణం చేపట్టాను. నేషనల్ ఫ్లాగ్ టవర్ నమూనా చిత్రాలను దేశంలోని ప్రముఖులందరికీ అందజేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఫ్లాగ్ టవర్ల నిర్మాణాలు జరగాలన్నదే జీవితాశయం. ప్రభుత్వ సహకారం ఉంటే మరింత అద్భుతంగా కట్టడాన్ని తీర్చిదిద్దుతాం.

– వడ్డి సుబ్బారావు, నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మాణ కర్త

లంకపేటలో తాగునీటి కోసం ఆందోళన



లంకపేటలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని లంకపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ లంకపేటలో గత మూడురోజులుగా తాగునీటి సమస్య వేధిస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. నేటికీ అనేక ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతూ ఆందోళనలు చేపడుతుంటే రాష్ట్రం చాలా అభివృద్ధి జరిగిపోయిందని పాలకులు గొప్పగా చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సమస్యని వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో మునిసిపల్ ఆఫీస్ దగ్గర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, త్రిమూర్తులు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విజయ కనకదుర్గమ్మ

కాళ్ల: మండంలోని కోమటిగుంట ఉన్న విజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారికి గ్రామంలోని మహిళలంతా పెద్ద ఎత్తున విచ్చేసి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కుంకుమ పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో మహిమలు కలిగిన అమ్మవారి ఆలయం నిర్మించిన నాటి నుంచి ప్రతి ఏటా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యలమంచిలి వెంకటరమణ, రామాంజనేయులు, గణపతి, రామాలయం కమిటీ సభ్యులు మంతెన నాగాంజనేయులు, గుర్రం సత్యనారాయణ, పులమంతుల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు ఉచిత న్యాయ సహాయం



25వ వార్డులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వం అందించే వితంతు పింఛన్ల కోసం అన్ని అర్హతలతో దరఖాస్తు చేసుకున్నా పింఛన్ మంజూరుకాకపోతే భీమవరం మండలన్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందజేస్తుందని మండల న్యాయ సేవా సంస్థ ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, కె.జ్యోతి, డి.రవికిరణ్ చెప్పారు. పట్టణంలోని 25వ వార్డు సచివాలయంలో బుధవారం వితంతు పింఛన్లపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఉచిత న్యాయసహాయం ద్వారా వితంతువులకు ఫించన్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వార్డు అడ్మిన్ పెంటకోటి బాలాజీ వెంకటేశ్వరరావు, ప్లానింగ్ సెక్రటరీ మద్దాల తాతాజీశంకర్, హెల్త్ సెక్రటరీ తిరుమాని కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

షాపుల్లో స్వాతంత్య్ర దినోత్సవ సందడి



త్రివర్ణ పతాకాన్ని కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మువ్వన్నెల జెండా పండుగను జరుపుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. పంద్రాగస్టు పండుగ వాతావరణం స్థానిక ప్రధాన సెంటర్‌లో బుధవారం ఉట్టిపడేలా కన్పించింది. వివిధ ఫ్యాన్సీ షాపుల్లో జాతీయ జెండాలకు గిరాకీ పెరిగింది. అధిక సంఖ్యలో విద్యార్థులు, స్థానికులు జెండాలను కొనుగోలు చేశారు. కొనుగోలుదారులతో సాయంత్రం మార్కెట్ రద్దీ పెరిగింది. ట్రాఫిక్‌తో సమస్య ఏర్పడింది. అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

ఓటర్ల జాబితాను తనిఖీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వై.రవికుమార్

పెనుమంత్ర: బూత్ లెవెల్ అధికారులు ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించాలని తహసీల్దార్ వై.రవికుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన ఓటర్ల జాబితా పరిశీలనపై బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఎల్ఓలు ఎన్నికల ప్రక్రియలో సమర్థవంతంగా పని చేయడంతో జిల్లా అధికారుల మన్ననలు అందుకోగలిగామని, అదే స్ఫూర్తితో పని చేసి గ్రామాల్లో అర్హత ఉన్న కొత్త ఓటర్లను గుర్తించడం, చనిపోయిన వారిని గుర్తించడం ఓటర్ల బదిలీపై వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.ఎలియమ్మ, సీనియర్ అసిస్టెంట్ కెవీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ లీడర్స్ ఎన్నిక



పీఎస్ఎం స్కూల్ లీడర్స్‌గా ఎన్నికైన విద్యార్థులను ప్రకటిస్తున్న హెచ్ఎం రాధాకృష్ణ



ఓట్లు వేసేందుకు బారులుతీరిన విద్యార్థులు

భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్ స్కూల్ పీపుల్ లీడర్(ఎస్‌పీఎల్) ఎన్నికలు బుధవారం రసవత్తరంగా జరిగాయి. జనరల్ ఎలక్షన్లను తలపించే విధంగా జరిగిన ఎన్నికల్లో విద్యార్థులే పోలింగ్ అధికారులుగా వ్యవహరించారు. స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్ ఎన్నికల్లో 778 మంది విద్యార్థులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్‌పీఎల్ పదవికి 6గురు, ఏఎస్‌పీఎల్ పదవికి 6 గురు విద్యార్థులు పోటీ పడగా ఎస్‌పీఎల్‌గా 9వ తరగతి విద్యార్థిని పి.పార్వతి, ఏఎస్‌పీఎల్‌గా 8వ తరగతి విద్యార్థిని బి.సుబ్బలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పాఠశాలలో ప్రతి ఏటా ఎన్నికలు నిర్వహిస్తున్నామని హెచ్ఎం రాధాకృష్ణ తెలిపారు. పాఠశాలలో 1,042 మంది విద్యార్థులకుగాను 778 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకే పోలింగ్ ప్రక్రియ పూర్తి కాగా వెంటనే స్కూల్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 10వ తరగతి విద్యార్థులు ఓట్ల లెక్కింపు ప్రారంభించి 3 గంటలకు కౌంటింగ్ పూర్తి చేశారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే విద్యలో రాణింపు



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో శ్రీరామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం : ఇంజినీరింగ్ విద్యార్థులు మానసిక వికాసం, సంపూర్ణ ఆరోగ్యంతోనే చదువులో బాగా రాణించగలరని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ (ఐఈఈఈ) విశాఖపట్నం విభాగం వైస్ చైర్మన్ కెవి శ్రీరామ్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం వేదిక్ విజన్ పేరిట క్రీడలు సంపూర్ణ ఆరోగ్యం మానసిక వికాసం అనే అంశంపై నిర్వహించే హ్యాకథాన్ పోటీలకు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, క్రీడలు విద్యార్థుల్లో మానసిక ప్రశాంతతను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని వీటిని ఆధారంగా చేసుకుని హ్యాకథాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీరామ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ఐఈఈఈ విశాఖ బీ సెక్షన్ కంప్యూటర్ సొసైటీ చాప్టర్ చైర్మన్ పి.శివకుమార్, ప్రోగ్రాం కన్వీనర్ పి.సత్యనారాయణరాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పోషకాహార కిట్ల అందజేత

భీమవరం:పట్టణంలోని స్వేచ్ఛ మహిళా సంఘం ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు బుధవారం పౌష్టికాహార కిట్లు, విద్యార్థులకు నోట్ బుక్స్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భీమవరం వన్ టౌన్ సీఐ ఎం.నాగరాజు మాట్లాడుతూ స్వేచ్ఛ మహిళా సంఘం మహిళలను సేవలను కొనియాడారు. ఏఆర్‌టీ సెంటర్ డాక్టర్ ఎం.గోవింద బాబు మాట్లాడుతూ ప్రభుత్వం హెచ్ఐవి బాధితులకు ఉచితంగా మందులను అందిస్తుందని రోగులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, గుణ్ణం సురేష్‌బాబు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, హరనాథ్, స్వేచ్ఛ మహిళా సంఘం సభ్యులు ధర్మావతి, సునీత, గౌరీ, పద్మ ,విజయలక్ష్మి, రాణి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకం



ఉండిలో సర్పంచ్‌లకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న అధికారులు

ఉండి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లది కీలకపాత్ర అని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. పంచాయతీ పాలన పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ వంటి అంశాలపై సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, డీపీఓ విక్టర్‌ల చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పంచాయతీ పాలనలో సర్పంచ్, కార్యదర్శి కీలకమని అన్నారు. గ్రామాభివృద్ధిలో వారి పాత్ర ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. అందువల్ల గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీరు వంటి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో మరింత శ్రద్ధతో ప్రజలతో మమేకమై వారిలో తడి చెత్త, పొడి చెత్త వేరుచేసేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల్లో మార్పు నెమ్మదిగా వస్తుందని దానికి సర్పంచ్, కార్యదర్శి కృషి చేయాలని అన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు గతంలో ఒకసారి శిక్షణ ఇచ్చామని, ఇప్పుడు మరోసారి శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, వీధిలైట్లు, పంచాయతీ పరిపాలన అంశాలపై శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోని సంపద సృష్టి కేంద్రాలను వచ్చే నెల 1లోపు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈఓపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే చట్టరీత్యా కఠిన శిక్షలు



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం

భీమవరం అర్బన్: మహిళలను వేధించినా, వారిపై దాడులకు పాల్పడినా చట్టరీత్యా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయని భీమవరం సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. మండలంలోని గొల్లవానితిప్పలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 100 రోజులపాటు జరిగే మిషన్‌శక్తి పథకంపై మహిళలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన వారిపైనా, సహకరించిన వారిపై కూడా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డకు ఆరోగ్యపరంగా అనర్థాలే జరుగుతాయన్నారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ డి.అనిల్ కుమారి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలి

పెనుగొండ: చెరుకువాడ జెడ్పీ పాఠశాలలో సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ డి.శుభాకరరావు అన్నారు. బుధవారం పెనుగొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నేడు కోరుకొల్లులో యూత్ రిట్రీట్

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో గురువారం యూత్ రిట్రీట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కన్వీనర్ మైలాబత్తుల యాకోబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ వై.జయరాజ్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. భీమవరం మన్నా మినిస్ట్రీస్‌కు చెందిన సన్నీ జోసఫ్ వాక్య సందేశం ఇస్తారని వివరించారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా



భీమవరం: అంబేడ్కర్ సెంటర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



ఉండి: హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

భీమవరం: ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.వీరయ్య జాతీయ జెండా ఎగురవేసి అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ యావత్ భారత దేశం గర్వించదగిననాయకుల్లో అంబేడ్కర్ ముందు వరుసలో ఉంటారన్నారు. కుల వివక్ష వ్యతిరేక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి పి.రాజబాబు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పిల్లి అమూల్యరావు, కోశాధికారి కె.సోమయ్య పాల్గొన్నారు.

ఉండిలో...



భీమవరం(ప్రకాశం చౌక్): హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల

ఉండి: దేశభక్తి చాలా గొప్పదని దానిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మన నాగబాబు అన్నారు. బుధవారం ఉండిలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ఉండి శశి స్కూల్ విద్యార్థులతో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకుడు సన్నిధిరాజు చలపతిరావు, పోలుబోతు రాము పాల్గొన్నారు.



కుప్పనపూడిలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మెప్మా ఆధ్వర్యంలో..

భీమవరం(ప్రకాశం చౌక్): హర్‌ఘర్ తీరంగా ర్యాలీన్ని బుధవారం భీమవరంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ శ్యామల పాల్గొన్ని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా హర్‌ఘర్ తీరంగా ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీవిద్య, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సీహెచ్ నానిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ఆకివీడు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు, వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తి భావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి గురువారం స్వాతంత్య్ర దినోత్సవం రోజు బహుమతులను సర్పంచ్ ఎం.అనురాధ అందజేయనున్నారు. స్థానిక మాదివాడలోని శాఖా గ్రంథాలయంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయజెండాతో నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది.